సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



చిగురించిన ఆశలు..
త్వరలోనే టీచర్ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు.
- 8లో



మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు అన్నారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
$32^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం(నేడు) సందర్భంగా సామూహికంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయం వద్ద కల్యాణ మండపంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మహిళలు భారీగా హాజరు కావాలని కోరారు.

భక్తులను కాపాడాలి



టేకుమట్ల: మండల ప్రజలను కన్యకా పరమేశ్వరి తల్లీ చల్లగా కాపాడాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గండ్ర సత్యనారాయణరావు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు వేడుకలలో పాల్గొన్నానని అన్నారు. మండల ప్రజలు సుఖశాంతులతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సత్యనారాయణ రావుకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

త్వరలో పనులు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ భూపాలపల్లికి విడుదల చేసిన నిధులతో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరిలో భూపాలపల్లి పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ పట్టణ అభివృద్ధికి రూ.50కోట్లు ప్రకటించినట్లు తెలిపారు. రూ.30కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఆ నిధులతో టెండర్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో రూ.20కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయని చెప్పారు. ఈ నిధులతో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

డీసీసీ మైనారిటీ సెల్ చైర్మన్‌గా ఫాజిల్



భూపాలపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్‌గా పట్టణానికి చెందిన ఎండీ.ఫాజిల్ ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫాజిల్‌కు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫాజిల్ మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లిలో సత్యనారాయణరావు గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అరవింద్



భూపాలపల్లి అర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఏఏపీ) భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగుల అరవింద్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాడని తెలిపారు. అతని సేవలను గుర్తించి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పోచమ్మ తల్లికి బోనాలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం పోచమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలు ఎత్తుకొని పోచమ్మ గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి అందరిని సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప సునీల్, వార్డు మెంబర్ బంగారు రమేష్, మోకాళ్ల వెంకటేష్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు వేళాయె..

- సెప్టెంబర్ 1నుంచి తరగతులు ప్రారంభం
- అడ్మిషన్ల ప్రక్రియ మరూ..
- మొదటి సంవత్సరంలో 100 సీట్లు
- ముగింపు దశకు చేరుకున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



కళాశాలకు చేరుకుంటున్న పరికరాలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మంజూర్‌నగర్ రామప్ప కాలనీ సమీపంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభానికి వేళయింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో కళాశాలలు ఎంపిక చేసుకున్న వారు ఈ నెల 26వ తేదీ వరకు కళాశాలలో సంబంధిత ధృవీకరణ పత్రాలను సమర్పించి అడ్మిషన్లు పొందనున్నారు. ఈ ప్రక్రియ గురువారం ప్రారంభం కాగా భూపాలపల్లి మెడికల్ కళాశాలకు పలువురు విద్యార్థులు వచ్చి అడ్మిషన్లు తీసుకున్నారు. కళాశాల ప్రారంభానికి కావాల్సిన అన్ని వసతులను.. వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర కోటా కింద 85 సీట్లు, ఆలిండియా కోటా కింద 15సీట్లు కేటాయించారు.

1నుంచి తరగతులు ప్రారంభం

కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆల్ ఇండియా కోటాలో మొదటి విడతలో నలుగురు విద్యార్థులు, రాష్ట్ర కోటాలో మొదటి రోజు నలుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మొదటి విడతలో 56మంది విద్యార్థులు భూపాలపల్లి కళాశాలను ఎంపిక చేసుకున్నారు. గడువులోగా వారు అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉంది. మరో రెండు విడతల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌లో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ కానున్నాయి. కళాశాలకు కావాల్సిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది నియామకాల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ ఏడాది ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు కొనసాగనున్నాయి.

వేగంగా కళాశాల నిర్మాణ పనులు

వచ్చే నెల 8వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మెడికల్ కళాశాల ప్రారంభించాలని, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నారు. 80శాతం వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. తుదిదశకు పనులు చేరుకున్నాయి. కళాశాలలో కావాల్సిన పరికరాలు కూడా ఒక్కొక్కటిగా వస్తున్నాయి. విద్యార్థులకు తాత్కాలికంగా హాస్టల్ వసతి కోసం కళాశాల సమీపంలోని సింగరేణి రామప్ప కాలనీలో తాత్కాలికంగా 14 క్వార్టర్లను కేటాయించారు. కళాశాలలో హాస్టల్ వసతి గృహాలు, అనుబంధ ఆస్పత్రి, ఇతర భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇటీవల మరో రూ.110 కోట్ల నిధులను కేటాయించింది. త్వరలోనే వాటికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించనున్నారు.



కొనసాగుతున్న మెడికల్ కళాశాల భవనం పనులు



కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ భవనం



విద్యార్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌దేవిడే

అనుబంధ కళాశాలగా జిల్లా ఆస్పత్రి

జిల్లాలో ఉన్నటువంటి జిల్లా ప్రధాన ఆస్పత్రి (100 పడకల) మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిగా మారనుంది. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆస్పత్రి పూర్తిగా మెడికల్ కళాశాల పరిధిలోకి తీసుకోనున్నారు. జిల్లా ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు, డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో అంతంత మాత్రంగానే వైద్యసేవలు అందుతున్నాయి. ప్రసవాలు మాత్రమే రోజుకు పదుల సంఖ్యలో అయ్యేవి. రోడ్డు ప్రమాదం బారినపడి ఆస్పత్రికి ప్రాణాపాయ స్థితిలో వస్తున్న వారు ఉంటున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో వరంగల్, హనుమకొండకు పరుగులు తీస్తున్నారు. వైద్య కళాశాల ఏర్పాటైతే నిపుణులైన వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్లు అందుబాటులోకి వస్తారు. ఒకటి రెండు సంవత్సరాల్లో ప్రస్తుతం అందుతున్న సేవలకు రెట్టింపు సేవలు అందుబాటులోకి వచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది.

నాణ్యమైన విద్య అందిస్తాం..



కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశం పొందే మొదటి సంవత్సరం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం. కళాశాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాం. ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుంది. కలెక్టర్ సహకారంతో సింగరేణి క్వార్టర్స్‌లో హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేశాం. కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అన్ని సీట్లు భర్తీ అవుతాయి. సీట్లు పొందిన విద్యార్థులు సకాలంలో అడ్మిషన్ చేసుకోవాలి.

– రాజ్‌దేవిడే, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

చల్లగరిగలో ఆనందోత్సవాలు

- చంద్రబోస్‌కు జాతీయ అవార్డు

చిట్యాల: కొండపొలం సినిమాలోని 'చెట్టెక్కి పుట్టతేనె పట్టి తెచ్చా మామ' అనే పాటకు చంద్రబోస్‌కు జాతీయ అవార్డు రావడంతో ఆయన స్వగ్రామం చల్లగరిగలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు. గతంలో ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు, ప్రస్తుతం జాతీయ అవార్డు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆనందంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు, పదో తరగతి వరకు కలిసి చదువుకున్న చంద్రబోస్‌కు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డుతో మా పల్లెను చంద్రబోస్ ప్రపంచానికి పరిచయం చేశాడు. ఇప్పుడు జాతీయ అవార్డుతో మా గ్రామానికి మరింత గుర్తింపు వచ్చింది.

దావు వీరారెడ్డి, చల్లగరిగ

పరిహారం ఇవ్వడంలో విఫలం

- మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల బ్యాక్‌వాటర్‌తో పంట భూములన్నీ నాలుగేళ్లుగా ముంపునకు గురవుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వడంలో విఫలమైందని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మహదేవపూర్ మండలం అన్నారం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాలుగేళ్లుగా పంటలు నష్టపోతున్నా పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు. మంథని నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. కాటారం సబ్‌డివిజన్‌లో రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీలు దుర్గయ్య, సుధాకర్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, నాయకులు రామారావు, శేఖర్‌రెడ్డి, శకీల్, అశోక్, తాజ్, పవన్, లక్ష్మణ్, రవిచంద్ర, వరప్రసాద్, వామన్‌రావు పాల్గొన్నారు.



అన్నారం పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

ఎఫ్ఎల్ఎన్ అసెస్‌మెంట్‌పై శిక్షణ

భూపాలపల్లి అర్బన్: ఎఫ్ఎల్ఎన్ అసెస్‌మెంట్ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన శిక్షణ సందర్భంగా డీఈఓ రాంకుమార్ మాట్లాడారు. ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్రస్థాయి ఎఫ్ఎల్ఎన్ అసెస్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పారదర్శకంగా సర్వే నిర్వహించాలని చెప్పారు. ఈ అసెస్‌మెంట్ ద్వారా భవిష్యత్‌లో మనం అవసరాల మేరకు ఎలాంటి కార్యక్రమాలు రూపొందించాలో తెలుస్తుందన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ అసెస్‌మెంట్ పూర్తి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ లక్ష్మణ్, మాస్టర్ ట్రైనర్లు ప్రసాద్, నాగరాజు, ఆర్‌పీ తాటం స్వామి పాల్గొన్నారు.

ఉన్నతిపై శిక్షణ

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు చేయనున్న ఉన్నతి కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో సామర్థ్యాలు అభ్యాసన ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు రాజమల్లయ్య, సారంగపాణి, రఘుకుమార్, సునీల్, వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

భూపాలపల్లి రూరల్: ములుగు నియోజకవర్గం పరిధిలోని భూపాలపల్లి మండలం పెద్దాపూర్, గుర్రంపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ తక్కువ శాతం అయినందున ఈసారి ఎక్కువ శాతం అయ్యేలా కృషి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ మొండయ్య, గుర్రంపేట సర్పంచ్ మార్క స్వేత – రవీందర్, స్విప్ అధికారి ప్రేమలత, వెంకటాపూర్ తహసీల్దార్ తాజుద్దీన్, ఎన్నికల బూత్ అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నోటిఫికేషన్ పత్రాల దహనం

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏఎన్ఎంల నోటిఫికేషన్ పత్రాలను గురువారం జిల్లాకేంద్రంలో ఏఎన్ఎంలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజ్ సతీష్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం పరిధిలో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకుండా జూలై 26న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు కృష్ణవేణి, సరళ, చంద్రకళ, పద్మ, సుజాత, శ్యామలత పాల్గొన్నారు.



అంబేడ్కర్ సెంటర్‌లో నోటిఫికేషన్ పత్రాలను దహనం చేస్తున్న ఏఎన్ఎంలు

ముగిసిన 'పొట్ట' పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారంలో పొట్ట పండుగ ముగిసింది. బుధవారం రాత్రి అమ్మవార్ల గద్దెల వద్ద జాగారం నిర్వహించిన పూజారులు గురువారం ఉదయం సమ్మక్క గుడికి చేరుకున్నారు. అమ్మవారికి కొత్త ధాన్యం నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు. కాగా, ఈ పండుగను మేడారంలోని పూజారుల కుటుంబీకులు, స్థానిక ఆదివాసీలు ఇండ్లలో జరుపుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మహాజాతర నేపథ్యంలో ఈ పొట్ట పండుగతో అమ్మవార్లకు తొలి పూజలు అందాయి. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు మునీందర్, లక్ష్మణ్‌రావు, మహేష్, మల్లెల ముత్తయ్య, ప్రధాన వడ్డె కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన బొజారావు, జనార్దన్, దూప వడ్డె నాగేశ్వర్‌రావు, సిద్దబోయిన స్వామి, రమేష్, పాపారావు పాల్గొన్నారు.



సమ్మక్క గుడికి వెళ్తున్న పూజారులు

విజయవంతంగా చిత్ర ప్రదర్శన

భూపాలపల్లి అర్బన్: విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించేందుకే జిల్లాలో ప్రదర్శించిన గాంధీ చిత్రం విజయవంతమైందని కలెక్టర్ భవేష్‌మిశ్రా గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం జిల్లాకేంద్రంలోని రెండు, గణపురంలోని 1 థియేటర్‌లో గాంధీ చిత్రాన్ని ఉచితంగా ఆగస్టు 14నుంచి 24 వరకు ప్రదర్శించినట్లు తెలిపారు. 6,850 మంది విద్యార్థులు చిత్రాన్ని తిలకించారని చెప్పారు. థియేటర్ల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చిత్ర ప్రదర్శన నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయ భవన పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం కలెక్టర్ భవేష్‌మిశ్రా కలెక్టరేట్ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ నిర్మాణం, సుందరీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 15ఎకరాలలో రూ.59.45 కోట్ల నిధుల వ్యయంతో ప్రభుత్వం కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టిందన్నారు. నిధులకు సమస్య లేనందున పనులలో వేగం పెంచాలని సూచించారు. అవసరమైన మేర అదనపు కార్మికులను ఏర్పాటుచేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 8న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభం ఉంటుందన్నారు. నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పర్యవేక్షించాలని, గ్రౌండ్ ఫ్లోర్ పనులను జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఫర్నిచర్ ఏర్పాటు కోసం సీపీఓ చర్యలు తీసుకోవాలని, అంతర్గత డెకరేషన్ సంబంధించి కలెక్టరేట్ పరిపాలనాధికారి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్డెనింగ్ పనులు ఆగస్టు 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన ఫొటో గ్యాలరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సంబంధిత పనులు త్వరగా జరిగేలా చూడాలని చెప్పారు. నీటి సరఫరా పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణ పనులపై ప్రతి రోజు సమీక్ష నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సకాలంలో పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



నిర్మాణ పనులపై అధికారులకు ఆదేశిలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి



కాటారం పీహెచ్‌సీలో బృందం సభ్యులు

కాటారం: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లెప్రసీ బృందం అధికారులు రాజేందర్, నర్సింహారెడ్డి అన్నారు. కాటారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీని స్టేట్ లెప్రసీ బృందం సభ్యులు సందర్శించారు. మండలంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులు ఉన్నారా అని ఆరాతీశారు. గుర్తింపుపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది మండలంలోని అంకుషాపూర్‌లో ఒక బాధితుడిని గుర్తించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో తగ్గుముఖం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీకి ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పట్టాయి. అన్నారం(సరస్వతీ) బ్యారేజీకి గోదావరి, మానేరుల గుండా 22,074 క్యూసెక్కులు, మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి ప్రాణహిత ఇన్‌ఫ్లో 1,58,230 క్యూసెక్కులు తరలిపోతుంది.

కన్వీనర్‌గా రేగుంట నరసయ్య

భూపాలపల్లి రూరల్: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అనుబంధ సింగరేణి ఎంప్లాయీస్ అసోసియేషన్ భూపాలపల్లి ఏరియా అడహక్ కమిటీ కన్వీనర్‌గా రేగుంట నరసయ్య, కమిటీ కో–కన్వీనర్‌గా ఆరుముల్ల రాజు నియమితులైనట్లు ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి శంకర్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కమిటీని ప్రకటించినట్లు తెలిపారు. నూతనంగా నియమితులైన రేగుంట నరసయ్య, అరుముల్ల రాజు మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి శంకర్, సంఘం నాయకులు రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనులపై ఎస్సీ, ఎస్టీ కార్మికులను ఏకంచేసి పూర్తిస్థాయి కమిటీని తొందరలోనే ఏర్పాటుచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



నరసయ్య
కన్వీనర్



రాజు
కో- కన్వీనర్

ఖాళీలను భర్తీ చేయాలి

మల్హర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలకు వెంటనే నియామకాలు చేపట్టి భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ముందే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ ప్రకటించి, పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎల్.రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా బాధ్యులు శనిగారం సదయ్య, బెజ్జం సతీష్‌కుమార్, నామిని శంకర్, మండల బాధ్యులు శ్రీనివాస్, రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు రశీదు పత్రాన్ని ఇస్తున్న మధుసూదన్

మాజీ కార్పొరేటర్‌పై కేసు

ఖిలా వరంగల్ : వరంగల్ లక్ష్మీనగర్ శాకరాసి కుంట సమీపంలోని ఓ నిర్జీవ ప్రదేశంలో బుధవారం రాత్రి కారు పార్క్ చేసి మద్యం సేవిస్తున్న ఓ మాజీ కార్పొరేటర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. మద్యం సేవిస్తూ పోలీసులను చూసి కారులో ముందుకెళ్తున్న ఆయనను పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి గురువారం తెల్లవారు జామున వదిలేసినట్లు సీఐ టి. సురేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆ మాజీ కార్పొరేటర్ రెండు నెలల క్రితమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అల్లుడి దాడి.. అత్త మృతి

రామన్నపేట : అల్లుడి దాడిలో అత్త మృతి చెందింది. మట్టెవాడ ఎస్సై నవీన్ కథనం ప్రకారం వృద్ధురాలు సామల వెంకటమ్మ (78) తన నాలుగో కూతురు వంగ సునీతతో కలిసి వరంగల్ సుజిత్‌నగర్‌లో నివాసముంటోంది. సునీత భర్త సంపత్ నిత్యం వెంకటమ్మను దూషించడంతోపాటు ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సంపత్ తన భార్య, కొడుకును ఓ గదిలో ఉంచి వెంకటమ్మ తలపై సుత్తితో కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధురాలిని వెంటనే ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి పెద్ద కూతురు దేవులపల్లి శోభరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఎస్సై నవీన్ తెలిపారు.

చిగురించిన ఆశలు..

- టీచర్‌పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- డీఎస్సీతోనే నియామకం
- రెండు రోజుల్లో విధివిధానాలు ఖరారు?



విద్యారణ్యపురి: సుదీర్ఘకాలంగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు. అయితే ఈసారి టీఆర్‌టీ ద్వారా కాకుండా పాతపద్ధతి డీఎస్సీ ద్వారానే భర్తీచేయబోతున్నారు. రాతపరీక్ష అనంతరం జిల్లా సెలక్షన్ కమిటీ భర్తీ చేయనుంది. అందుకు రెండు మూడురోజుల్లో కలెక్టర్లు విధివిధానాలు ప్రకటిస్తారని సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఈడీ, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే టీచర్ ఎల్జిబులిటీ టెస్టు (టెట్) నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏడాది సెప్టెంబర్15న టెట్ నిర్వహిస్తారు. అదే నెలలో 27న ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో టెట్‌కు అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రానుండడంతో ఆయా అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలవారీగా ఎన్ని వెకెన్సీలు భర్తీచేస్తారు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు వేలాది మంది ఉన్నారు. దీంతో వీరు కొన్నేళ్లుగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. 2017లో టీఆర్‌టీ ద్వారా టీచర్ల పోస్టుల భర్తీ చేశాక మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు జిల్లాలుగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి విభజించబడింది. ఈ నేపథ్యంలో ఏ జిల్లా నియామకాలు ఆ జిలాలోనే కొనసాగుతాయి. అయితే అభ్యర్థుల్లో వివిధ కేటగిరీల్లో ఎన్ని పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.. అందులో ఎన్ని భర్తీ చేస్తారనే అంశం ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో మాత్రం 5,089 టీచర్ పోస్టులు మాత్రమే భర్తీచేస్తారని, స్పెషల్‌ఎడ్యూకేషన్ లో1523 టీచర్‌పోస్టులు భర్తీచేయబోతున్నారని సమాచారం. అంతకంటే ఎక్కువగానే పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టే వేకెన్సీలను భర్తీచేయబోతున్నారని సమాచారం.

హనుమకొండ జిల్లాలో 318 పోస్టులు ఖాళీ..

హనుమకొండ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,693 పోస్టుల మంజూరు ఉండగా అందులో 2,375మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 318 పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. గ్రేడ్ 1 హెచ్ఎం పోస్టులు ఒకటి వేకెన్సీగా ఉండగా గ్రేడ్ హెచ్ఎంలు 46 ఉన్నాయి.ఎస్‌జీటీ తెలుగు మీడియం 74, ఉర్దూమీడియం 8 పోస్టులు వేకెన్సీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్స్ మ్యాథ్స్ 7, ఫిజిక్స్ 4, బయోసైన్స్ 17, సోషల్‌స్టడీస్ 38 , తెలుగు 9, హిందీ 8, ఉర్దూ 1, ఫిజికల్ ఎడ్యూకేషన్ 5, పీఎస్‌హెచ్ఎం 45,ఎల్‌పీ తెలుగు 2, ఎల్‌పీ హిందీ 3, పీఈటీ 6, ఆర్ట్ డ్రాయింగ్ టీచర్ 8, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ 17, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 4 వేకెన్సీలుగా ఉన్నాయి.

జనగామ జిల్లాలో 426 పోస్టులు..

జనగామ జిల్లాలో అన్ని కేటగిరీల కలిపి 426 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 2,570 కేడర్ స్ట్రెంత్ (పోస్టుల మంజూరు) ఉండగా అందులో 2,144మంది పనిచేస్తున్నారు.హెచ్ఎం పోస్టులు 49, పీఎస్‌హెచ్ఎం పోస్టులు 57, స్కూల్ అసిస్టెంట్లు 167, ఎస్‌జీటీ పోస్టులు 118, పండిట్లు 21, పీఈటీలు 7వేకెన్సీలుగా ఉండగా ఇంకా వివిధ కేటగిరీలో పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.

మహబూబాబాద్‌జిల్లాలో 595..

మహబూబాబాద్‌జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 595 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 3,681 టీచర్ల కేడర్ స్ట్రెంత్ ఉండగా అందులో 3,086 మంది పనిచేస్తున్నారు.595 వేకెన్సీలుగా ఉన్నాయి. హెచ్ఎం పోస్టులు 39, పీఎస్‌హెచ్ఎం 70, మ్యాథ్స్ 20, ఫిజిక్స్ 8, బయోసైన్స్ 53, సోషల్‌స్టడీస్ 62, తెలుగు 18, హిందీ 10, ఇంగ్లిష్ 24, ఫిజికల్ ఎడ్యూకేషన్ 8 ఎల్‌పీ తెలుగు 14, ఎల్‌పీ హిందీ 5, పీఈటీ 2, ఎస్‌జీటీ పోస్టులు 262 వేకెన్సీలుగా ఉన్నాయి.

- వరంగల్‌జిల్లాలో అన్నికేటగిరీల టీచర్ పోస్టులుకలిపి 490వరకు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం,
- ములుగు జిల్లాలో 300లకుపైగా టీచర్‌పోస్టులు వెకెన్సీలుగా ఉన్నాయని సమాచారం.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోఅన్ని కేటగిరీలు కలిపి 325కుపైగా టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం. వేకెన్సీల్లో కొంతశాతం పదోన్నతుల ద్వారా, మరికొంత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు.జిల్లా కలెక్టర్లు విధివిధానలను ప్రకటించాకా త్వరలోనే నోటిఫికేషన్ కూడా ఇస్తారనేది సమాచారం.

సర్కారు బడికే జై..

- తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తహసీల్దార్
- అభినందించిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి

చిల్పూరు : ప్రస్తుత కాలంలో సామన్యుల నుంచి.. సంపన్నుల వరకు.. నిరక్షరాస్యుల నుంచి.. ఉన్నత విద్యావంతుల వరకు.. కిందిస్థాయి సిబ్బంది నుంచి.. ఉన్నతాధికారుల వరకు అందరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే వీరందరికీ చిల్పూరు తహసీల్దార్ సరస్వతి భిన్నం. తన కుమారుడు శ్రీవర్ధన్‌ను గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసుకుని పుస్తకాలు అందజేసి తరగతిగదిలో కుర్చోబెట్టారు. దీంతో తహసీల్దార్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వేణు, మంజుల, వెంకటరమణాచార్య, ఎస్ఎంసీ చైర్మన్ పంతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు.. సీపీఎం ఆందోళన



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : దేశాయిపేట శివారు ప్రభుత్వ భూమిలో వెలిసిన 1600 గుడిసెలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి తొలగించారు. గుడిసెల తొలగింపుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ పోలీసులు నిర్దాక్షణ్యంగా గుడిసెలు నేలమట్టం చేశారని మండిపడ్డారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా ఇండ్లు లేని నిరుపేదలకు ఇంత వరకు స్థలాలు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, సింగరాపు బాబు, ముక్కెర రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అరూరికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కబ్జారాయుళ్లపై పీడీ యాక్ట్



నిందితులకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న సీఐలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు కబ్జారాయుళ్లపై సీపీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏనుమాములలో నివాసముంటున్న జన్ను అనిల్, గీసుకొండ మండలం కీర్తీనగర్ ప్రాంతానికి చెందిన పోలెపాక విజయ్‌పై పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ సీఐలు శ్రీనివాస్, సురేష్ గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లి కారాగారంలో జైలర్ సమక్షంలో వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. నిందితులు ఖాళీ స్థలాలపై కన్నేసి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి వాటి ద్వారా అసలు స్థల యజమానులను బెదిరిస్తూ భూ కబ్జాలకు పాల్పడడంతోపాటు ఇబ్బందులకు గురిచేసేవారని తెలిపారు. ఈ తరహా కేసుల్లో జన్ను అనిల్‌పై ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు, పోలెపాక సంజీవ్ పై మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



మహిళాసంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి

పాలకుర్తి : తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 20 వేల కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రతీ మహిళకు రూ. 3 లక్షల రుణాలు అందజేశామన్నారు. ఈ డబ్బుతో మహిళలు వివిధ ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికంగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల సంఘాల్లో 45 లక్షల పైగా సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి.. మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 కోట్లు విలువైన రుణాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో నూరోద్దీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎస్‌బీఐ షేక్‌అబ్దుల్ రహీం, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, వీరమనేని యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట : వరంగల్ లోకల్ బస్టాండ్ ప్లాట్‌ఫాం నంబర్-1 వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్ గంజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటాడని తెలిపారు. సన్నగా నలుపురంగుతో ఆకుపచ్చ లుంగీ, గ్రే కలర్ చెక్స్ కలిగిన ఫుల్ షర్టు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ మృతదేహాన్ని వరంగల్ బస్టాండ్‌లో ప్యాసింజర్ గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న గంజి రాజేందర్ గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తించారన్నారు. సదరు వ్యక్తికి స్పృహ లేకపోవడంతో 108కు సమాచారం అందించినట్లు తెలిపారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి హెచ్‌పీ ఫ్లేమ్‌ప్లస్ గ్యాస్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహేష్‌రామ్, గ్యాస్ డీలర్లు

హన్మకొండ అర్బన్ : నగరంలోని కమర్షియల్ గ్యాస్ వినియోగదారుల కోసం హెచ్‌పీ(హిందూస్థాన్ పెట్రోలియం) గ్యాస్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ సౌత్ సెంట్రల్ జోన్ జీఎం మహేశ్‌రామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లేమ్ ప్లస్ గ్యాస్ వినియోగంతో అధిక ఉష్ణోగ్రత, అధిక సామర్థ్యం, తక్కువ గ్యాస్ ఖర్చు అవుతుందన్నారు. సమపాళ్లలో ఉష్ణోగ్రత, మంట నిలకడగా రావడం వల్ల సమయం ఆదా అవుతుందని, తద్వారా 10 శాతం వరకు గ్యాస్ ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీజీఎం మనోజ్ గోయల్, హెచ్‌పీ డీలర్స్ ఏ.వి సత్యమోహన్, పి.వెంకటేశ్వరావు, రామకృష్ణ రాజు, మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, శంకర్, మనుకార్తీ, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

- బృందాలుగా వీడిన పోలీసులు..
- నిందితుల కోసం గాలింపు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో సంచలనం రేకెత్తించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు మేరకు ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్, స్టేషన్ పోలీసులు నాలుగు బృందాలుగా వీడి నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. వృద్ధుడిని హత్య చేసి పరారైన ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై ఎటువైపు వెళ్లారు? బైక్‌ను ఎక్కడ పడేసి ఉంటారు? లేదా బైక్‌పై ప్రయాణం చేసి ఉంటారా? అనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. ఘటనా స్థలిలో క్లూస్ టీం సేకరించిన ఆధారాలను కూడా పోలీసులు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు ప్రదీప్‌చందర్ పేర్కొనట్లు 'గతంలో పత్తిపాక శాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి మృతుడు రాంచందర్ మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. భూ వివాదంలో భాగస్వామి అయిన వ్యక్తే రాంచందర్‌ను హత్య చేసి ఉంటాడా..?' అనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. హత్యకు గురైన వృద్ధుడితో వివాదం ఉన్న వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను కూడా విచారించి వదిలేసినట్లు తెలుస్తోంది. వృద్ధుడి కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని కూడా విడివిడిగా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, వృద్ధుడి హత్యకు సుపారీ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నవజాత శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ హామీ



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

పాలకుర్తి : ఓ నవజాతి శిశువు మృతి చెందింది. ఈ ఘటన పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన జిట్టబోయిన రామలీల, సోమమల్లయ్య దంపతుల కూతురు స్రవంతికి జఫర్‌గఢ్ మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం స్రవంతి గర్భం ధరించి ప్రసూతి నిమిత్తం తల్లిందడ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గురువారం పురిటి నొప్పులు రావడంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ సమయంలో డాక్టర్ స్వప్న అందుబాటులో లేరు. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ సరిత మైనర్ ఆపరేషన్ చేసింది. అయితే శిశువుకు చలనం లేకపోవడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు.

స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి..

డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేని సమయంలో స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసిన డీసీహెచ్ఎస్ సుగుణాకర్‌రాజు, ఏసీపీ సురేష్, సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటినా పాలకుర్తి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

పెన్షన్ కోసం వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



బుచ్యా(ఫైల్)

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని మంగళవారిపేటలో జరిగింది. నాజీతండాకు చెందిన అజ్మీరా బుచ్యా(81), భద్రు పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి ద్విచక్ర వాహనంపై తండా నుంచి మంగళవారిపేటకు వచ్చారు. డబ్బులు తీసుకుని వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో బుచ్యాకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, భద్రుకు స్వల్ప గాయాలు కావడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నీలిగొండ వీరాంజన్(32) గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వేరే ఊరికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా వీరాంజన్ ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. కాగా, నేలపై, మృతుడి కాళ్లకు రక్తం మరకలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళ అదృశ్యం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీలత తన కూతురుతో కలిసి గురువారం అదృశ్యంది. బుధవారం ఉదయం కూతురును పాఠశాలకు తీసుకెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీలత తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.